శివకు ఘన సన్మానం

కందుకూరు. ఫిబ్రవరి 2 : విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే గుర్తింపు ఉంటుందని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహ తెలిపారు. మండల పరిధిలోని సాయిరెడ్డి గూడ గ్రామానికి చెందిన ఊటు శివ ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో ఎంపికై ముంబైలో నిర్వహించిన క్రీడల్లో పాల్గొని స్వగ్రామానికి తిరిగి రావడంతో అంబేద్కర్ విగ్రహం వద్ద స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ మండల ఇన్‌చార్జి గూడూరు భాస్కర్, పోతుగంటి అశోక్, కంబాలపల్లి అంజి, బీఆర్ఎస్ మండల నాయకులు ఊటు మల్లేశ్, కృష్ణ, జంగయ్య, మహేశ్ పాల్గొన్నారు.

బాక్స్‌డ్రెయిన్ పనుల్లో వేగం పెంచాలి

పద్మానగర్‌లో బాక్స్‌డ్రెయిన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట, ఫిబ్రవరి2 : ముంపు ప్రాంతాల్లో నిర్మిస్తున్న బాక్స్‌డ్రెయిన్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. చంపాపేట డివిజన్ పరిధిలోని పద్మానగర్ కాలనీలో కొనసాగుతున్న బాక్స్‌డ్రెయిన్ నిర్మాణ పనులను శుక్రవారం కాలనీవాసులతో కలిసి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరిశీలించారు. బాక్స్‌డ్రెయిన్ నిర్మాణాల ఎత్తును తగ్గించేలా చూడాలని కాలనీ వాసులు ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సాంకేతిక ప్రణాళికల ప్రకారమే బాక్స్‌డ్రెయిన్ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. అధికారులతో చర్చించి ఎత్తును తగ్గించేట్లు కృషి చేస్తానన్నారు. పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. దీంతో పాటు ఉదయ్‌నగర్ కాలనీ బాక్స్ డ్రెయిన్ సైతం త్వరలో జంక్షన్ దగ్గర కలపడం జరుగుతుందన్నారు. బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనుల తప్పకాల కారణంగా పలు కాలనీ వాసులకు కొంత ఇబ్బందులు కలుగుతున్నాయని వారు ఎంతో సహనంతో నిర్మాణ పనులకు సహకరించటం సంతోషదాయకమన్నారు. బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులు పూర్తయితే నియోజకవర్గంలోని ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం పాలకమండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుంకోజు కృష్ణమాచారి, బీఆర్ఎస్ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి, ఎల్బీనగర్ యూత్ వింగ్ అధ్యక్షుడు రవిముదిరాజ్, నాయకులు చేగోని మల్లేశ్‌గౌడ్, ఉమామహేశ్వర్, నాగేశ్, శివ, నిసీకాంత్‌రెడ్డి, జగదీశ్, కాలనీ వాసులు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, యాదయ్య, విజయానంద్ రెడ్డి, నారాయణ రెడ్డి, ఆంజనేయులు, నగేశ్, శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవో 118 ప్రాసిడింగ్స్ జారీ చేయాలి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 2 : ఎల్బీనగర్ నియోజకవర్గంలో మిగిలిన జీవో 118 ప్రాసిడింగ్స్‌ను అందజేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి రంగారెడ్డి కలెక్టర్‌ను కోరారు. అందుకు కలెక్టర్ నుంచి కూడా సానుకూలంగా స్పందన లభించిందని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. రెండు రోజుల క్రితం కలెక్టర్‌ను కలిసిన సందర్భంగా తాను ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు ప్రధాన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లామన్నారు. జోవో 118లో ఇంకా ఇవ్వాల్సిన ప్రాసిడింగ్స్‌ను జారీ చేయాలని కోరామని, రోషన్ దౌలా కాలనీ సమస్య చాలా రోజులుగా పెండింగ్‌లో ఉంచారని వాటిని పరిష్కరించాలని కోరామన్నారు. హయత్‌నగర్ సర్వే నంబర్ 255 అసైన్‌ల్యాండ్ సమస్యలు, మన్సూరాబాద్ డివిజన్ సర్వేనంబర్ 93/1లోని ప్రభుత్వ భూమి రెండు ఎకరాల 20 గుంటలకు ఉండాల్సి ఉండగా కేవలం 20 గుంటలు మాత్రమే ఉన్నదని దానిని పూర్తి స్థాయిలో విచారణ జరిపించి రీ సర్వే చేసి చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. సాహెబ్ నగర్ శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయానికి సంబంధించి రెండు ఆక్యుపెన్సీ రైట్ సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగిందని, ఈ విషయంలో విచారణ జరిపి ఏది కరెక్ట్ అన్నది తేల్చాలని కోరామని ఎమ్మెల్యే తెలిపారు. గ్రీన్‌పార్కు కాలనీ ఎఫ్‌టీఎల్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్‌ను కోరామన్నారు. కలెక్టర్ సంబంధిత అధికారులతో సదరు సమస్యలపై చర్యలు తీసుకోవాలని, పరిష్కారానికి ముందుకెళ్లాలని ఆదేశించారన్నారు.

గాంధీనగర్‌లో రేషన్ షాపు ఏర్పాటు

బడంగ్‌పేట, ఫిబ్రవరి2: ఇంత కాలం రేషన్ షాపు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే స్పందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సహకారంతో గాంధీనగర్ బొడ్రాయి దగ్గర రేషన్ ఇవ్వడం జరుగుతుందని కార్పొరేటర్ సూర్ణ గంటి అర్జున్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 8గంటల వరకు రేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. పరిసర ప్రాంతాల కాలనీ వాసులు ఇక ఇతర ప్రాంతాలకు పోవలసిన అవసరం లేదన్నారు. రేషన్ కార్డులు ఉన్న లబ్ధి దారులు అందరు రేషన్ తీసుకునే అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మెరాజ్ హుస్సేన్

సీసీ రోడ్డు పనులు పరిశీలన

మాదన్నపేట, ఫిబ్రవరి 2: నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని యాకుత్‌పూర ఎమ్మెల్యే మెరాజ్ హుస్సేన్ అన్నారు. యాకుత్‌పూర నియోజకవర్గంలోని కుర్మగూడలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటి సమస్యలు ఉన్నాయని వాటిని అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నియోజకవర్గ ప్రజలతో ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్ కార్పొరేటర్ ముజఫర్ హుస్సేన్,కార్పొరేటర్ మహపర,సీనియర్ నాయకులు సంధాని,షర్‌ఫత్ తదితరులు పాల్గొన్నారు.

యువకులు క్రీడలపై ఆసక్తి చూపాలి

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ మంద జ్యోతి పాండు

కందుకూరు. ఫిబ్రవరి 2 : యువకులు క్రీడలపై ఆసక్తి చూపాలని ఎంపీపీ మంద జ్యోతి పాండు తెలిపారు. మండల పరిధిలోని దావుద్‌గూడ, పొచమ్మ , బంజారుగడ్డ తండాల్లో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువకులు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. యవకులు క్రీడలపై ఆసక్తి చూపితే భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడల్లో రాణించిన వారిని ప్రభుత్వం గుర్తించి వారిని ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ, మాజీ వార్డు సభ్యులు, పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక పాత్ర

నేదునూరులో పంచాయతీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న గ్రామస్తులు

కందుకూరు, ఫిబ్రవరి 2 : గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డితో పాటు పంచాయతీ పాలకవర్గాన్ని సన్మానించిన అనంతరం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డితో కలిసి మాట్లాడుతూ పాలకవర్గం 5 సంవత్సరాల పాటు కలిసి కట్టుగా అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. భావితరాలకు గుర్తింపు ఉండే విధంగా అభివృద్ధి పనులు చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నీలం రాఘవేందర్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు ఎండీ అబ్జల్ భేగ్, గంగుల అఖిల, అనుసూయ, సోమరాజు వెంకటేశ్, నల్లబోలు అండాలు,మిద్దె సంతోష,నోముల సువర్ణ, పద్మమ్మ, ఎగిరిశెట్టి నర్సింహ, కరుణాకర్‌రెడ్డి, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు సక్రమంగా చేయాలి

సైదాబాద్, ఫిబ్రవరి2: పారిశుధ్య నిర్వహణ పనుల్లో లోపం లేకుండా సిబ్బంది పనిచేయాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ సూచించారు. శుక్రవారం ఉదయం సైదాబాద్ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీల్లో పారిశుధ్య నిర్వహణ పనులు సక్రమంగా కొనసాగటం లేదని ప్రజలను నుంచి ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఉదయం ఆరు గంటల నుంచి క్షేత్రస్థాయికి వెళ్లి సిబ్బంది పనులను తనిఖీ చేశారు. కొంతమంది సూపర్‌వైజర్లు తమ డ్యూటీలు సక్రమంగా చేయకుండా డుమ్మాలు కొట్టి, సొంత పనులకు పరిమితమయ్యారని, వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. డ్యూటీలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠినంగా వ్యవహరిస్తామని ఆమె హెచ్చరించారు.

వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

వర్క్‌షాపులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేసిన జగన్ మోహన్ రెడ్డి

స్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో కల్చరల్ లీడర్‌షిప్

బడంగ్‌పేట, ఫిబ్రవరి2: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లోని స్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో ఫిట్‌నెస్ క్లబ్ ఆఫీస్ బేరర్స్, సంస్కృతి ఫౌండేషన్, మిథాని సమన్వయంతో సుపోషన్ సమష్టి వివేక్ బ్యాండ్ 2024 బీ గుడ్, డూ గుడ్ క్యాంపెన్ నిర్వహించారు. కళాశాల వర్క్ షాపులో కల్చరల్ లీడర్‌షిప్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు దశలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కళాశాల కార్యదర్శి జగన్ మోహన్ రెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధికి సీనియర్ సిటిజన్స్ సేవలు అవసరం

విజేతలకు జ్ఞాపికలను అందజేస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 2: సమాజ అభివృద్ధి కోసం సీనియర్ సిటిజన్స్ సేవలు ఎంతో అవసరమని మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ చంద్రపురికాలనీలోని కమ్యూనిటీ హాల్లో తెలంగాణ రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండోర్ గేమ్స్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ తమ అనుభవాలను పంచుకుంటూ యువతకు మార్గదర్శకులుగా నిలువాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ సోమి రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారావు, సభ్యులు ప్రతాప్‌రెడ్డి, యాదిరెడ్డి, సుధాకర్, మధుసూదన్‌రావు, అమృత్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్‌కు శుభాకాంక్షలు

మాదన్నపేట, ఫిబ్రవరి 2: ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన కొండేటి శ్రీధర్‌కు యాకుత్‌పూర కన్వీనర్ మోహన్ కృష్ణ, మీడియా కన్వీనర్ మధు జనపాల,జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, నాయకులు ప్రదీప్, ప్రసాద్,పవన్ శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

భగత్‌సింగ్‌నగర్‌లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీవాణి

ఆర్కేపురం, జనవరి 2 : భగత్ సింగ్‌నగర్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ తెలిపారు. సరూర్‌నగర్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో సమస్యల సత్వర పరిష్కారానికి ఈవినింగ్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. డివిజన్‌లోని ప్రతి కాలనీలో పర్యటించి కాలనీ ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకొని వాటి సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

చెరువు స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

భైరమాల్‌గూడ చెరువును పరిశీలిస్తున్న ఆర్డీవో సూరజ్‌కుమార్

చంపాపేట, ఫిబ్రవరి2: చెరువు స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో సూరజ్‌కుమార్ హెచ్చరించారు. చెరువు స్థలాల పరిరక్షణలో భాగంగా కందుకూర్ రెవెన్యూ డివిజనల్ ఆర్డీఓ సూరజ్ కుమార్, సరూర్‌నగర్ తహసీల్దార్ కృష్ణతో కలిసి శుక్రవారం చంపాపేట డివిజన్ పరిధిలోని భైరమాల్‌గూడ చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా చెరువు స్థలాల ఆక్రమణకు యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం డీజీపీ మెషన్‌తో భైరమాల్‌గూడ చెరువు విస్తీర్ణాన్ని సమగ్రంగా గుర్తించి త్వరలో నివేదిక ఇవ్వాలని సర్వేయర్‌ను వారు ఆదేశించారు.

మహ్మద్ ఇబ్రహీం కుటుంబానికి ఆర్థిక సాయం

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 2: రౌడీషీటర్ల చేతిలో హతమైన మహ్మద్ ఇబ్రహీం కుటుంబ సభ్యులకు ఎంబీటీ పార్టీ అధికార ప్రతినిధి అమ్జదుల్లాఖాన్ శుక్రవారం లక్ష రూపాయలు అందజేశారు. ఈ నేపథ్యంలో ఎంబీటీ పార్టీ మాజీ కార్పొరేటర్ అమ్జదుల్లా ఖాన్ షహీన్‌నగర్‌లోని మృతుడి తల్లి, భార్య నౌషీన్ అక్తర్ ను కలిసి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా అమ్జదుల్లాఖాన్ మాట్లాడుతూ బర్మా క్యాంప్‌లో రాత్రి పగలు తేడా లేకుండా పోలీస్‌స్టేషన్ లకు తీసుకెళుతున్నారన్నారు. కొంతమంది మామూళ్లను డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు.

నగదును అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ అమ్జదుల్లాఖాన్

పహాడీషరీఫ్ దర్గాకు దట్టి

కందుకూరు. ఫిబ్రవరి 2 : మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విజయం సాధిస్తే పహాడీ షరీఫ్‌లోని దర్గాకు దట్టి సమర్పిస్తామని బీఆర్ఎస్ మండలాధ్యక్షురాలు, ఎంపీటీసీ తాండ్ర ఇందిరమ్మ దేవేందర్ మొక్కున్నారు. అందులో భాగంగా ఆమె విజయం సాధించడంతో ఇందిరమ్మ దంపతులు శుక్రవారం దర్గాకు వెళ్లి దట్టిని సమర్పించి మొక్కును తీర్చుకున్నారు. ఎమ్మెల్యేగా సబితా ఇంద్రారెడ్డిని గెలిపించిన ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలి

వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు రాంచందర్

కందుకూరు. ఫిబ్రవరి 2 : దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని నేదునూరులో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్, మతతత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ప్రతిఘటనకు పూనుకోవాలని మోదీ వైఫల్యాన్ని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మోదీ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 16న జరిగే కార్మిక కర్షక గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుడ్డీరపు శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కుమార్, నాయకులు శ్రీరాములు, సాయిలు, యాదయ్య, వెంకటయ్య, జగన్, ఆంజనేయులు, బాలయ్య, నర్సింహ, జంగయ్య, యాదయ్య, యాదమ్మ పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

మలక్‌పేట, ఫిబ్రవరి 2: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సురేశ్ ప్రకారం.. చిత్తూర్ జిల్లా కుప్పంకు చెందిన వినోద్ జీవనోపాధి కోసం సలీంనగర్‌లోని ప్రతాప్‌రెడ్డి అపార్ట్‌మెంట్, ఫ్లాట్ నంబర్ 224 నివాసముంటున్నారు. వినోద్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తుండగా, అతడి తల్లి అంబిక ఫర్హత్ హాస్పిటల్ పక్కన కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నారు. కాగా గురువారం ఉదయం కుమారుడితో గొడవపడి సొంతూరుకు వెళ్తున్నానని చెప్పి ఇంటినుంచి బయలుదేరి వెళ్లారు. ఇంటికి చేరుకోకపోవటంతో ఆందోళనకు గురైన వినోద్, బంధువులు, తెలిసిన వారికి ఫోన్‌చేసి వాకబు చేయగా ఆచూకీ లభించలేదు. దీంతో అతడు మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సురేశ్ కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థులు

జీవో 46ను రద్దు చేయాలి

ఆర్కేపురం, జనవరి 2 : గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 46ను రద్దు చేస్తామని మాట ఇచ్చి ఇప్పుడు తీరా అధికారంలోకి వచ్చాక మాట తప్పాలని చూస్తుందని జీవో 46 బాధిత విద్యార్థులు ఆరోపించారు. శుక్రవారం సరూర్‌నగర్ వీఎం హోం మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడులూ తమ భవిష్యత్ కార్యాచరణ ప్రకటించారు. రానున్న రెండు, మూడు రోజుల్లో జీవో 46 బాధిత విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అనుకూల ప్రకటన రాకపోతే మంత్రుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ వైఖరి ఇదే విధంగా కొనసాగితే వచ్చే ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున నిలబడే అభ్యర్థులను చిత్తుగా ఓడిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహేష్, అనీల్, నవీన్, ప్రవీణ్, ఆకాశ్, శంకర్, మధు, వెంకట్‌రాముడు, శ్రీకాంత్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్రాలతో ఏడు ప్లాట్ల కబ్జాకు యత్నం

జూబ్లీహిల్స్,ఫిబ్రవరి2: రాఘవేంద్ర రెసిడెన్సీ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను మోసం చేసి 7 ప్లాట్లు కబ్జా చేయాలని కుట్రపన్నిన కుటుంబరావుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని శుక్రవారం హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు గురునాథంతో పాటు సభ్యులు ఫిర్యాదు చేశారు. నగరంలోని హయత్‌నగర్ స్వాతి రెసిడెన్సీ పక్కన 194 సర్వే నంబర్‌లోని 3 ఎకరాల స్థలాన్ని హయత్‌నగర్‌కు చెందిన గడ్డం మల్లేశ్, అంజయ్య, రాజమ్మలు విక్రయించగా 1985 లో గుమ్మి నర్సింహారెడ్డి జేపీఏ చేయించుకుని 42 ప్లాట్లుగా చేసి అమ్ముకున్నారు. ఇందులో ప్లాట్లు కొనుగోలు చేసిన ప్లాట్ ఓనర్లు ఒక అసోసియేషన్ ఏర్పాటు చేసుకోగా ఇందులో ఛార్టర్డ్ అకౌంటెంట్ పరుచూరి వెంకట బసవ కుటుంబరావు 1986 లో లేని భూమిని సృష్టించి నాడు మరొక జేపీఏ చేయించుకున్నారని.. అంతేకాక 2023 వరకు తనకు ప్లాట్‌లు ఉన్నాయని ఎవరికి చెప్పకపోగా 1985 నుంచి లే అవుట్ ప్లాట్ పొజిషన్‌లలో ఉన్న వారికి తెలియకుండా 2024 లో మోసపూరితంగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు యత్నించారని ఆరోపించారు. అధికారులకు నకిలీ పత్రాలు సమర్పించి అబద్ధపు అఫిడవిట్లు ఇచ్చిన కుటుంబరావుపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 24 మందికి జైలు శిక్ష

మాదన్నపేట, ఫిబ్రవరి 2: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 11వ ఎంఎం కోర్టు న్యాయమూర్తి 24 మందికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధించారు. గురువారం 22 మందిని పోలీసులు కోర్టులో హాజరు పరచగా అందులో 12 మందికి జైలు శిక్ష , నలుగురికి జరిమానా తోపాటు రెండు రోజుల జైలు శిక్ష, ఏడుగురికి జరిమానా తోపాటు 4 రోజుల జైలు శిక్ష , ఒక్కరికి జరిమానా తోపాటు 8 రోజుల జైలు శిక్ష విధించారని సంతోష్‌నగర్ ట్రాఫిక్ సీఐ తెలిపారు.

నేడు విద్యుత్ కోతలు

సైదాబాద్, ఫిబ్రవరి 2 : విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆస్మాన్‌ఘడ్ డివిజన్ డీఈ హనుమంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.